క్లుప్తంగా

నేడు మల్లమ్మ తల్లి గృహ జాతర

డుంబ్రిగుడ: సాగర పంచాయతీ అడపవలసలో మల్లమ్మ తల్లి గృహ జాతర బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు మోహన్‌రావు తెలిపారు. అదే రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం నుంచి గిరిజన సంప్రదాయ బద్ధంగా థింసా నృత్యాలు, ఒడియా నాటకాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చదువులో రాణించాలి



విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: ప్రభుత్వం అందిస్తున్న అమ్మ ఒడి, విద్యాకానుక, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత విద్య వంటి పథకాలు గిరిజన విద్యార్థులు వినియోగించుకుని చదువులో బాగా రాణించాలని సర్పంచ్ ఐసరం హనుమంతరావు కోరారు. సొలభం పంచాయతీ ఎగరచ్చపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, విద్యార్థుల హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బడి ఈడు పిల్లందరినీ బడికి పంపించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.

సీతాపురంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దాతలు

ఎటపాక: దివంగత ఎంపీటీసీ చంద్రు శ్రీదేవి, ఆమె తండ్రి రాధాకృష్ణ జ్ఞాపకార్థంగా సీతాపురంలో చలివేంద్రాన్ని వారి కుటుంబ సభ్యుడు బాచినేని మల్లేశ్వరరావు మంగళవారం ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు దాహార్తి తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసం రాజులు, కడియాల వెంకటేశ్వరావు, ముప్పా శ్రీను, వల్లభనేని చందు, శంకరరావు, పూరేటి వెంకటేశ్వరరావు, అప్పలస్వామి, రాజేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సోలార్ రక్షిత పథకాలు



కిన్నెర్ల బందలో నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని మారుమూల గ్రామాల్లో గిరిజనులకు రక్షిత పథకాల ఏర్పాటుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. సోలార్‌తోపాటు, గ్రావిటీ విధానంలో కిన్నెర్లబంద, నక్కలబంద చక్కలమామిడి గ్రామాల్లో చేపట్టిన తాగునీటి పథకాల పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. సివిల్ పనులు పూర్తి చేసి త్వరలో పథకాలను ప్రారంభిస్తామని తెలిపారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



సదస్సులో మాట్లాడుతున్న సుబ్బరాజు

రంపచోడవరం: ఏజెన్సీలో క్షయ వ్యాధి నిర్మూలనకు క్షేత్రస్థాయిలో పనిచేసే వనమూలిక వైద్యులు, ఆర్ఎంపీలు కృషి చేయాలని ప్రకృతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జి. సుబ్బారాజు అన్నారు. మంగళవారం రంపచోడవరంలో ఏజెన్సీలోని వనమూలిక వైద్యులు, ఆర్పీఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారాజు మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే వారికి క్షయ లక్షణాలు ఉంటే, వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాజిటివ్ వస్తే ఆర్నెల్లపాటు మందులు వాడడం ద్వారా పూర్తి వ్యాధి నుంచి కోలుకోవచ్చన్నారు. కోఆప్షన్ మెంబరు షేక్ ఖాజావలీ, క్షయ సూపర్‌వైజర్లు గీతాంజలి, వంశీధర్, ఆసుపత్రి కౌన్సిలర్ వాసు, ఆర్ఎంపీలు ధాన్యం భాస్కరరావు, రెడ్డి పాల్గొన్నారు.

మలేరియా మహమ్మారిని తరిమి కొడదాం

- పరిసరాల పరిశుభ్రతతోనే నివారణ
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



వై.రామవరం: మానవహారంగా వైద్యాధికారులు, సిబ్బంది

రాజవొమ్మంగి: మలేరియా నిర్మూలనకు సహకరించాలని వైద్యాధికారి లిఖిత ప్రజలను కోరారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజవొమ్మంగి వీధుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక అల్లూరి సెంటర్లో ఆమె మాట్లాడుతూ దోమతెరలను ఇతరత్రా ఉపయోగించకుండా రాత్రి పూట నిద్రపోయే సమయంలో వాడాలన్నారు. దోమ కాటు వల్ల చికెన్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకి ప్రాణాలకే ప్రమాదమని అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, సిబ్బంది లక్ష్మయ్య, నాగవాసు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. ఇదే తరహాలో లాగరాయి, జడ్డంగి పీహెచ్‌సీల పరిధిలో కూడా మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీలు జరిగాయి. డాక్టర్ యామిని ప్రియ, డాక్టర్ రవీంద్ర ఏచూరి పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మలేరియా వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణ సూచించారు. మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సర్పంచ్ కొండా జాకబ్, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ నుంచి అరకు-పాడేరు ప్రధాన రోడ్డు మార్గం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షించుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు సాంబశివరావు, రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం: పరిసరాల పరిశుభ్రతతో మలేరియా మహమ్మారిని తరిమి కొడదామని వైద్యాధికారి రాజీవ్ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా కూనవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ డి.శ్రీనివాస్, సీత, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రాజేష్, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేష్, రత్నం, హెల్త్‌సిస్టెంట్లు, ఆశలు పాల్గొన్నారు.

ఎటపాక: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించటం ద్వారానే మలేరియా నివారించవచ్చని నెల్లిపాక పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష్ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ విష్ణుప్రియ, హెచ్‌వీ, పీహెచ్ఎన్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం యు.చీడిపాలెం, డౌనూరు ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలను నిర్వహించారు. దోమలను నివారిస్తే మలేరియా రాదని నినాదాలు చేశారు. దీనిలో యు.చీడిపాలెం వైద్యులు జయప్రకాష్, ఎల్‌టీ సత్తిబాబు, ఫార్మసిస్టు సురేంద్ర, హెచ్‌వీ విజయలక్ష్మి, డౌనూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ రోజ్, వైద్యులు లలిత, మలేరియా సబ్ యూనిట్ అధికారి నీలకంఠం నాయుడు, ఎంపీహెచ్ఈవో నూకరాజు, ఎంపీహెచ్ఎస్ రాజుబాబు, హెచ్‌వీ రాణి, బి. శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.



ఎటపాక: నెల్లిపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ముంచంగిపుట్టు: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముంచంగిపుట్టు సీహెచ్‌సీ, లబ్బూరు, కిలగాడ పీహెచ్‌సీల వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి ప్రబలకుండా గ్రామాల్లో గిరిజనులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నినాదాలు చేశారు. వైద్యాధికారులు రమేష్, ప్రతాప్, శిరీష, శ్యాంప్రసాద్, ఎంపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వై.రామవరం: చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, చవిటిదిబ్బలు జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. మలేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్మూలనా చర్యలపై అవగాహన కల్పించారు. మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



మారేడుమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు



డౌనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, వైద్య సిబ్బంది

అందరి నోట మా నమ్మకం నువ్వే జగన్

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రాప పంచాయితీ లివిటి, గొందిరాప, బురదగుమ్మి, సరియపాలం గ్రామాల్లో 205 గడపలను తిరిగారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ, మంచినీరు సమస్యలను తీర్చాలని విన్నవించగా ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. ఇప్పటివరకు అన్ని గ్రామాల్లో మంచినీరు, రోడ్లు సమస్యలు తీర్చాలన్నారు. కొద్ది రోజుల్లో అన్ని సమస్యలు తీరుస్తామన్నారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా లివిటి గ్రామంలో ఇంటింటికి తిరిగారు. సచివాలయం కన్వీనర్లతో కలిసి సంక్షేమ పథకాలు గురించి వివరించి ఇంటింట స్టిక్కర్లు అంటించారు. గ్రామల్లో అందరి నోట మా నమ్మకం నువ్వే జగన్ అనే మాట వినిపిస్తుందని, వచ్చే ఎన్నికల తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ కొప్పుల దేవుడమ్మ, పాటి చిన్నయ్య, పాంగి సింహాచలం, ఎంపీటీసీలు కోరాబు నాగలక్ష్మి, కొర్ర నాగరాజు, మండల యువజన విభాగం కార్యదర్శి కోరాబు వెంకట్, నాయకులు ధర్మయ్యదొర, భూషణ్, మహేష్, చిన్నబ్బి, సుబ్బారావు, వెంకట్, సుబ్బారావు పాల్గొన్నారు.



గొందిరాపలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

మెనూ అమలు తీరు భేష్

పెదబయలు: విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం మెనూ అమలుతీరు బాగుందని ఎంపీపీ బొండ వరహాలమ్మ తెలిపారు. కొరవంగి గిరిజన సంక్షేమ పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. అక్కడ నాడు – నేడు అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల దశ నుంచి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని పట్టుదలతో సాధించాలన్నారు. అనంతరం మెనూ అమలు తీరును పరిశీలించారు. బొండాపల్లి గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అదనపు గదులు సదుపాయం కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు. హెచ్ఎం రాంబాబు, ఉపాధ్యాయులు ప్రతాప్ చంద్, మాజీ ఎంపీటీసీ మజ్జి చంద్రుబాబు, తదితరులు పాల్గొన్నారు.



కొరవంగి పాఠశాలలో మెనూ పరిశీలిస్తున్న ఎంపీపీ వరహాలమ్మ

ప్రతి గడపలో సంక్షేమం, అభివృద్ధి



పనసలో కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు



గూడెంకొత్తవీధి: బ్రోచర్లను విడుదల చేస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ కృష్ణవంశీ

ముంచంగిపుట్టు: జగనన్న ప్రభుత్వంలో ప్రతి గడపలో సంక్షేమం,అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండలాధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ తెలిపారు. మండలంలో వనుగుమ్మ పంచాయతీ పనస, దొడిపుట్టు పంచాయతీ గొత్తురు ముండా, సిందిపుట్టు గ్రామాల్లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి పనులపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మిల్కి, వసంత, మండల నేతలు శివ, సుఖదేవ్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ కృష్ణవంశీ అన్నారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంగళవారం పెదవలస పంచాయతీలో జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి గృహ సారథులు వివరించారు. వైస్ ఎంపీపీ ఆనంద్, ఉప సర్పంచ్ సింహాచలం, మండల కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు.

28 నుంచి కాటూరం వేల్పుల పండగ

చింతూరు: మండలంలోని చట్టిలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడో గట్టు కాటూరం గోత్రం వేల్పుల పెద్ద జాతర నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తుర్రం పొడియందొర, రామయ్యదొర, చిన్నగంగయ్య, చిన్నముత్తయ్య మంగళవారం తెలిపారు. నలభై ఏళ్ల తర్వాత తెలంగాణ నుంచి వేల్పుల కర్రలు చట్టి తీసుకురానున్నట్టు పేర్కొన్నారు. చట్టిలోని తుర్రం, మడకం, బంగారు, ఇర్పం, పూ నెం గుంపులకు చెందిన పెద్దల జాతర నిర్వహణకు నిర్ణయించినట్టు తెలిపారు.

నేడు కుట్రవాడలో గ్రామసభ

మారేడుమిల్లి: సర్పంచ్ సార్ల రమాదేవి అధ్యక్షతన పాములేరు పంచాయతీ పరిధి కుట్రవాడ గ్రామంలో బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి వంశీ రాఘవ మంగళవారం తెలిపారు. గ్రామసభకు ప్రజలు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మూలపేటలో పైపులైన్ పనులు

కొయ్యూరు: సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం మూలపేట గ్రామంలో కుళాయిలు ఏర్పాటు చేసేందుకు వీలుగా పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఒక వీధికి పైపులైన్ లేదు. దీంతో కొత్తగా పైపులు వేస్తున్నారు. ఇది పూర్తికాగానే కుళాయిలకు వాటిని అనుసంధానం చేస్తారు. పైపులు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు, రేపు ఆధార్ క్యాంపు



మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

కొయ్యూరు: పోలీసుల ఆధ్వర్యంలో బుధ, గురువారాలు శరభన్నపాలెం గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్టు సీఐ స్వామినాయుడు, ఎస్ఐ రాజారావు తెలిపారు. మంగళవారం రాత్రి ఇక్కడ వారు అవగాహన కల్పించారు. ఆధార్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారి వివరాలను పోలీసులకు అందజేస్తే లైసెన్స్ మేళాను ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ మాధవి, తదితరుల పాల్గొన్నారు.

'సస్పెన్షన్ ఎత్తివేయాలి'

జి.మాడుగుల: తనిఖీల పేరుతో పాఠశాలల ఉపాధ్యాయులను పాఠశాల ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సస్పెన్షన్ చేయటం తగదని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబిడి శ్యామసుందరం తెలిపారు. ప్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పాఠశాల ముఖ్య కార్యదర్శికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఉపాధ్యాయులు, అధికారులపై చేసిన అక్రమ సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల ఎదుట నినాదాలు చేశారు.

ప్రజల వద్దకే పాలన ప్రభుత్వ లక్ష్యం

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: ప్రజల వద్దకే పాలన ప్రభుత్వ లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గొందిపాకలు పంచాయతీ పరిధిలోని మంగళవారం జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించి అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాచపనస, తోటమామిడి, గొడుగుమామిడి, డప్పులగుంట గ్రామాల్లో 300 గడపలు తిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని ప్రతి పక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఎవరెన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారన్నారు. మళ్లీ రాబోయే ఎన్నికల్లో మన ప్రభుత్వం అఖండ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అమ్మఒడి, రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, నాడు- నేడు, సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్లు వంటివి దేశానికే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం అందించిన సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ షేక్ మీరా, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణబాబు, ఎంపీటీసీలు మెహన్‌రావు, పద్మ, మాజీ సర్పంచ్ బెన్నస్వామి పాల్గొన్నారు.



గిరిజనులకు బ్రోచర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఆపదలో అండగా...

నిరుపేద దంపతులను ఆటోలో ఆస్పత్రికి తరలించిన ట్రస్టు

హుకుంపేట: ఆపదలో ఉన్న వారికి మన్యప్రగతి చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తోంది. మంగళవారం తీగలవలస పంచాయతీ జంగంగరువు గ్రామానికి చెందిన మర్రి కామరాజు వ్యవసాయ పనుల నిమిత్తం కొండపైకి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో తన కుడి కాలికి బలమైన గాయాలై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మరో వైపు తన భార్య కళావతికి ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి వెళ్లడానికి చేతిలో చిల్లిగవ్వ లేక ఇంట్లోనే ఉండిపోయింది. ఈ విషయం మర్రి కామయ్య ఆశయ సాధన సమితి సభ్యులు మన్యప్రగతి ట్రస్టు ప్రతినిధులకు సమాచారం అందించారు. వెంటనే ట్రస్టు తరఫున ఆటోలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎంపీటీసీ కొర్ర నాగరాజు, మర్రి కామయ్య ఆశయ సాధన సమితి సభ్యులు కొంతమొత్తం అందించి మానవత్వం చాటుకున్నారు.



కామరాజు దంపతులను ఆటోపై ఆస్పత్రికి తరలిస్తున్న ట్రస్ట్ సభ్యులు

దోమల నివారణ మందు పిచికారీ



పిచికారీని పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నూకరాజు

జి.మాడుగుల: గెమ్మెలి పీహెచ్‌సీ పరిధి సొలభం సచివాలయం-2లో గొందిపాడు, మధురమామిడి, రీమెలి, ఎగరచ్చపల్లి గ్రామాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి రొబ్బా నూకరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఏసీఎం ఐదు శాతం మలేరియా పిచికారీ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి నూకరాజు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇంట్లో మంచినీటి డ్రమ్ములు, మిగతా పాత్రల్లో నిల్వ నీటిని బయట పారబోసి ఎండలో ఆరబెట్టి మరలా కొత్తగా నీటిని పట్టుకోవాలని సూచించారు. కాచి వడపోసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం లక్ష్మీపతిరాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లో రైతులు రసాయన ఎరువులకు, క్రిమిసంహారక మందులకు చెక్ పెట్టి సహజ సిద్ధమైన పశువుల పేడ, గెత్తంతో ప్రకృతి వ్యవసాయం చేయాలని ఏవో పాత్రుడు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్ఎఫ్) మార్కెటింగ్ ట్రైనర్ వెంకటరావు తెలిపారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళిక 2023-24 (నవ ధాన్యాల సాగు-నేలతల్లికి బాగు)పై బ్యానర్, వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికపై ఏవో మాట్లాడుతూ సహజ సిద్ధంగా లభించే పశువుల పేడ, ఆవు మూత్రం, పరిసరాల్లో దొరికే ఆకులతో ఘన, ద్రవ, బీజామృతం, కషాయాలు, ద్రావకాలతో తయారీ చేసుకుని వాడటం వల్ల భూమిని సారవంతం చేస్తూ ప్రకృతిని కాపాడుకోవచ్చని సూచించారు. నవధాన్యాలతో పీఎండీఎస్ కిచెన్ గార్డెన్స్, మోడల్స్ వేసుకోడం వల్ల రైతు తక్కువలో అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుర్మని మత్స్యకొండంనాయుడు, మార్కెటింగ్ మండల యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వరి, పాపారావు, సీఆర్పీలు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఏవో పాత్రుడు, ప్రజాప్రతినిధులు

ప్రశ్నిస్తే వేధించినట్టేనా...?

సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు నిలదీత

రంపచోడవరం: గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలందించాలని చెప్పడం కూడా వేధింపులకు గురిచేస్తున్నట్లా అని ఎంపీటీసీలు ప్రశ్నించారు. ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లుదొర, మంగమ్మ, ముచ్చిక సాయిబాబాదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముసురుమిల్లి పంచాయతీలో ఏ సమస్య గురించి చెప్పినా సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ కుంజం వంశీ చెప్పడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. డెత్ సర్టిఫికెట్లు చేసేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దాంతో సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ మధ్య వాగ్వాదం నెలకొంది. కార్యదర్శుల తీరును నిరసిస్తూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. ఎంపీడీవో కుమార్‌బాబు వారితో మాట్లాడారు. ఒక కార్యదర్శి గురించి సమావేశం నుంచి బయటకు రావడంపై సర్దిచెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని చెబితే వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించడంపై ఎంపీటీసీలు మండిపడ్డారు. ప్రశ్నిస్తే వేధించినట్టే అవుతుందా అని అన్నారు. ఎంపీడీవో సమాధానంతో శాంతించి తిరిగి సమావేశానికి వెళ్లారు. సమావేశంలో పలు సమస్యలు చర్చించారు.



తిరిగి సమావేశానికి వెళ్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు

దైవచింతనతో మానసిక ప్రశాంతత

అనకాపల్లిటౌన్ : దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈనెల 11వ తేదీన కశింకోట మండలం కన్నూరుపాలెంలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.